క్లుప్తంగా

ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయండి

బొండపల్లి:ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ ఏ.రఘుపతి రావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. గ్రామాల వారీగా ఇంటి పన్ను బకాయిల పై పంచాయతీ కార్యదర్శులను ఆరా తీశారు. శతశాతం వసూళ్ల పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.పన్ను వసూళ్లు పూర్తయినే గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడానికి అవకాశం కలుగుతుం దని చెప్పారు.

కౌలు రైతుల సమస్యల పరిష్కారంలో విఫలం

బొండపల్లి: కౌలు రైతుల సమస్యలను పరిష్కరించడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి రాకోటి రాములు ఆరోపించారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కౌలు రైతులకు గత ప్రభుత్వం కంటే మెరుగైన ప్రయోజనాలు కల్పిస్తామని టీడీపీ కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా కౌలు రైతులకు ఇచ్చిన ఏ హామీ కూడా నెరవేరలేదని పేర్కొన్నారు. నూతన కౌలు రైతు చట్టం తెస్తామని హామీ ఇచ్చారని, నేటి వరకు ఆదిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోగా, కౌలు రైతులకు వ్యవసాయ సంబంధిత పథకాలు అందజేయకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలని, అన్నదాత సుఖీభవతో పాటు అన్ని వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.

పైప్‌లైన్‌కు లీకులు.. వృథాగా తాగునీరు



పైప్‌లైన్ లీకులతో వృథాగా పోతున్న తాగు నీరు

చీపురుపల్లి: పైపులైన్ల లీకేజీలతో తాగునీరు వృథా అవుతోంది. ఇందిరమ్మ సుజలధార తాగునీటి ప్రాజెక్టు కార్యాలయానికి వెనుక భాగంలో ఉన్న ట్యాంకుల వద్ద పైప్‌లైన్లు లీకేజీ అవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ప్రధాన పైప్‌లైన్‌కు ఓ వైపు లీకులు అవుతుంటే గుడ్డలుకట్టారే తప్ప నీరు వృథాకాకుండా పరిష్కారం చూపలేదు. దీంతో రోజుకు వేల లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది.

పర్లలో మూడో విడత రీసర్వే



పర్లలో రీసర్వే నిర్వహిస్తున్న సర్వే అధికారులు

చీపురుపల్లి: మండలంలోని పర్ల గ్రామంలో మూడో విడత రీసర్వే పనులు రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్నారు. మండల సర్వేయర్ ఆధ్వర్యంలో సర్వే సిబ్బంది సోమవారం మూడో విడత రీసర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూథింగ్ కోసం సర్వే చేపట్టారు. రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మహంతి అప్పలనాయుడు పాల్గొన్నారు.

పైడితల్లమ్మా.. వారికి సద్బుద్ధి ప్రసాదించు



పైడితల్లి అమ్మవారి చిత్రపటంతో నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర గ్రామంలో జిందాల్ నిర్వాసితులు జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు, విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు జరుగుతుండడంతో అమ్మవారి చిత్రపటం పట్టుకుని నిరసన చేపట్టారు. ఈసందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ 108 రోజులు గా శాంతియుతంగా పోరాటం చేస్తున్నామని, అయినా తమసమస్యపై ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్నారు. వారికి సద్బుద్ధి ప్రసాదించాలని పైడితల్లి అమ్మవారిని వేడుకున్నారు. తమ పోరాటం ఫలిస్తే వచ్చే పైడితల్లమ్మ సిరామాను పండగకు కుటుంబాలతో వచ్చి మొక్కులు చెల్లించుకుంటామని అన్నారు.

అరకొర సిబ్బంది.. ఆరోగ్యానికి ఇబ్బంది..!

- మెరకముడిదాం పీహెచ్‌సీలో సిబ్బంది కొరత
- రోగులకు తప్పని తిప్పలు



మెరకముడిదాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మెరకముడిదాం:

మండల కేంద్రంలోని మెరకముడిదాం పీహెచ్‌సీలో సిబ్బంది కొరత రోగులకు ఇబ్బందిగా మారింది. సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందడం లేదు. పీహెచ్‌సీలో ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉండాలి.. ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. సాతాంవలస ఏఎన్‌ఎం బదిలీపై వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ఎఫ్‌ఎన్‌ఓ పోస్టు నెలల తరబడి భర్తీ చేయలేదు. ఆఫీస్ సబార్డినేటర్ పోస్టు ఖాళీగా ఉంది. వాస్తవంగా పీహెచ్‌సీలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలి. సిబ్బంది కొరతతో సేవలు మృగ్యంగా మారాయి. సిబ్బంది ఖాళీలను భర్తీచేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి అజిత్‌బాబు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేకపోవడంపై మండల వాసులు మండిపడుతున్నారు. రాత్రివేళ పీహెచ్‌సీలో వైద్యం గాలిలో దీపంలా మారిందని రోగులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు స్పందించి వెంటనే మండల కేంద్రంలో ఉన్న మెరకముడిదాం పీహెచ్‌సీలో ఖాళీ పోస్టులను భర్తీచేయాలని కోరుతున్నారు.

సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే...

పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి పలుమార్లు నివేదికల రూపంలో తెలియజేశాం. ఉన్న సిబ్బందితో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. ఖాళీగా ఉన్న రెండు స్టాఫ్‌నర్సు పోస్టులు భర్తీచేస్తే వైద్యసేవలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– కె.అజిత్‌బాబు, మెరకముడిదాం పీహెచ్‌సీ వైద్యాధికారి

ఘనంగా గ్రామదేవత విగ్రహ ప్రతిష్ఠోత్సవం



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి శ్రీనివాస్,తదితరులు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంటలో గ్రామదేవత బంగారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం సుమారు మూడు వేలమందికి అన్నదానం చేశారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత, సంబంధాల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు పలు పార్టీలకు చెందిన నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి కొండపల్లికి చిట్టాయవలస గ్రామానికి చెందిన లెంక లక్ష్మీనారాయణ వినతిపత్రం అందజేశారు. తమ అయిదు పాడిగేదెలు విద్యుత్ షాక్‌తో ఇటీవల మృతి చెందాయని, ఉపాధి కోల్పోయామని తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు లక్ష్మీనారాయణ మంత్రిని కోరారు.

చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కె.వి.ఎస్.రామరాజు, తదితరులు

శృంగవరపుకోట: శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో పట్టణంలో దేవీ ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అనంతరం పేద మహిళల కు చీరలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.వి.ఎస్.రామరాజు, పట్టణ ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు.

యూరియాను బ్లాక్‌లో అమ్ముకున్నారు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆరోపణ



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ గోపమ్మ

కొత్తవలస: గతంలో ఎన్నడూ లేదని విధంగా యూరియా కృత్రిమ కొరత సృష్టించి వ్యవసాయ అధికారులు, టీడీపీ కూటమి నాయకు లు కుమ్మక్కై బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకున్నారని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన, ఎంపీడీఓ రమణయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం సోమ వా రం నిర్వహించారు.ఈ సమావేశానికి కూటమి పార్టీలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గైర్హాజరయ్యారు. ముందుగా శాఖల వారీ గా అధికారులు నివేదికలు చదివి వినిపించారు. మండల వ్యవసాయశాఖ అధికారి రామ్‌ప్రసాద్ మాట్లాడుతుండగా పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు లేచి యూరియా పంపిణీ అంశంపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. రైతులందరికీ సమానంగా యూరియా అందించాల్సిన అధికారులు కూటమి నాయకుల వత్తిళ్లకు తలొగ్గారని మండిపడ్డారు. కూటమి నాయకులు సూచించిన వారికే యూరియా అందజేశారని, అదే సమయంలో బ్లాక్ మార్కెట్‌లో అధికారులు అమ్ముకున్నారని ఆరోపించారు.అనంతరం ఉపాధిహామీ పథకం ఏపీఓ జనార్ధనరావు మాట్లాడుతూ ఉపాధి వేతనదారులు అంతా ఖచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. ఈకేవైసీ చేయించుకున్న వారికే పని కల్పిస్తామని తెలిపారు. అలాగే మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీలో మండలానికి ఒక్క పోస్టు కూడా మంజూరు కాలేదని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు,ఎంపీటీసీ,సర్పంచ్‌లు హాజరైయారు.

నడక వంతెన నిర్మించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కొత్తవలస: మండల కేంద్రంలో కొత్తవలస డాబాల సమీపంలో రైల్వే అండ్ బ్రిడ్జి వద్ద నడక వంతెన నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు గాడి అప్పారావు, రామకృష్ణ మాట్లాడుతూ కొద్ది పాటి వర్షానికే రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తిగా నీటితో నిండిపోతోందని అన్నారు.రైల్వే అధికారులు కనీస ఆలోచన లేకుండా అడ్డదిడ్డంగా అండర్ బ్రిడ్జి నిర్మించారని ఆరోపించారు. తాజాగా కురిసిన వర్షాలకు బ్రిడ్జి కింద నీరు చేరడంతో రైల్వే అధికారులు రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారని, బ్రిడ్జి అవతల నివాసాల, గ్రామాల ప్రజలు నానావస్థలు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నడక వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు.

కృష్ణారాయుడుపేటలో పశువైద్య శిబిరం



పశువులకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్ గాయిత్రీ

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో వేపాడ పశువైద్యాధికారి గాయత్రీ ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు.శిబిరంలో 25 పశువులకు చూడిద తనిఖీలు, 35 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేయడంతో పాటు పది పశువులకు కృత్రిమ గర్భదారణ ఇంజెక్షన్‌లు చేశారు. అలాగే సుమారు వంద పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశుపోషణలో తీసు కోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ చెలుబోను ముసలినాయుడు(బాలబాబు), పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌ను అరెస్ట్ చేస్తే ఎందుకు పట్టించుకోలేదు..?



గ్రామసభలో ప్రశ్నిస్తున్న సర్పంచ్ రమణ

శృంగవరపుకోట: గ్రామసభ నిర్వహిస్తున్న తనను పోలీసులు అకారణంగా అరెస్టు చేస్తే నియోజకవర్గంలో ఏ ఒక్క ప్రజాప్రతినిధి కానీ, నాయకులు కానీ స్పందించ లేదని పెదఖండేపల్లి గ్రామ సర్పంచ్ యాళ్ల రమణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ జిందాల్ భూముల్లో ఎంఎస్ఎం పార్కు వద్దంటూ గతంలో తాము గ్రామ సభ ఏర్పాటు చేసినప్పుడు పోలీసులు వ్యవహరించిన తీరును సభకు వివరించారు. సోమవారం నాటి గ్రామసభకు ఇతర ప్రాంతాల నాయకులు రావడంతో వారిని వెళ్లిపోవాలని సర్పంచ్ కోరారు.దీనికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ స్పందిస్తూ పార్టీ ఆదేశాలతో వచ్చామని, ఇక్కడ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. సర్పంచ్ అరెస్టును అడ్డుకోలేకపోయిన మీరు వేరే గ్రామంలో గ్రామసభకు ఎలా వస్తారని స్థానికేతర నాయకులను సర్పంచ్‌తో పాటు పలువురు ప్రశ్నించారు. ఈఓపీఆర్డీ లక్ష్మీ స్పందిస్తూ పెదఖండేపల్లి పంచాయతీ కానీ వారు గ్రామసభ నుంచి వెళ్లి పోవాలని కోరడంతో స్థానికేతరులు బయటకు వెళ్లిపోయారు. గ్రామసభ నిర్వహణలో పంచాయతీ కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని సర్పంచ్ అన్నారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ జిందాల్ తమ గ్రామస్తుల నుంచి సేకరించిన భూములను వెనక్కి ఇవ్వాలని కోరారు.

ప్రభుత్వ వ్యవస్థలపై దాడులుచేస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ రాఘువులు



మాట్లాడుతున్న డీఎస్పీ రాఘువులు

గుర్ల:

ప్రభుత్వ వ్యవస్థలపై తిరుగుబాటుచేస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని చీపురుపల్లి డీఎస్పీ రాఘువులు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. జమ్ములో దుర్గాదేవి నిమజ్జనోత్సవంలో ఘర్షణలు జరిగాయని, ఇందులో పోలీసులపై గ్రామస్తులు తిరుగుబాటు చేయడంతో హోంగార్డుకు గాయాలయ్యాయన్నారు. గ్రామస్తులపై స్వల్ప లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చినట్టు వెల్లడించారు. హోంగార్డు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి సర్పంచ్ గొర్లె నరసింహమూర్తితో పాటు మరో 19 మందిని అరెస్ట్ చేశామని చెప్పారు. వారిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఆదివారం రాత్రి అరెస్టుచేసే సమయంలో కొంతమంది పోలీసులపై బంకమన్ను, వాటర్ ప్యాకెట్స్, ఇసుకతో దాడులు చేశారని, ఈ దాడుల్లో కానిస్టేబుల్ శివకు గాయాలయ్యాయని, దీనిపై మరో కేసు నమోదు చేస్తున్నామని, ఈ రెండు కేసుల్లో సుమారుగా 100 మందిని అరెస్టు చేస్తామని చెప్పారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



గజపతినగరం: పంచాయతీ కార్యదర్శులు,ఏఎన్ఎంలతో సమావేశమైన ఎంపీడీఓ కల్యాణి

గజపతినగరం: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి వనరుల క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ బి.కల్యాణి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో సోమవారం కన్వెర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, అంటురోగాలు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు,ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని అన్నారు. గ్రామాల్లో మురుగు కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తీయించాలని, తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని చెప్పారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు సాయికృష్ణారెడ్డి, సుష్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

దత్తిరాజేరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో తరచూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ పంచాయతీ కార్యదర్శులను సోమవారం ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మురుగు కాలువల్లో చెత్త, పూడిక పేరుకు పోయే అవకాశం ఉందన్నారు. వాటిని తొలగించి బ్లీచింగ్ చల్లించాలని తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయాలని చెప్పారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



బాలికల కూచిపూడి నృత్య ప్రదర్శన



సంగీత కళాశాలలో సప్తస్వరాలయం వారి గాత్రకచేరీ



లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

విజయనగరం టౌన్: పైడితల్లి తొలేళ్ల సంబరాలు, విజయనగరం ఉత్సవాలు పురస్కరించుకుని నగరంలోని వివిధ వేదికలపై సోమవారం చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల కచేరీ మందిరంలో 293 మంది కళాకారులతో 36 సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు చూపరులను ఆద్యంతం అలరించాయి. లేడీస్ క్లబ్ సాహితీ వేదికపై చేపట్టిన అష్టావధానం ఆసక్తికరంగా కొనసాగింది. లయన్స్ కమ్యూనిటీ హాల్, గురజాడ కళాభారతి వేదికలపై జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఏకాపాత్రాభినయం, నాటికలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి.

నెల్లిమర్ల: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా విజయనగరంలో చేపట్టిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో జరజాపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రూపొందించి ప్రదర్శించిన గణిత ప్రాజెక్టు బెస్ట్ ప్రాజెక్టుగా ఎంపికైంది.

భోగాపురం: విజయనగరం జిల్లా కేంద్రంలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన, సాంస్కృతిక పోటీల్లో మండలంలోని ముంజేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని, బహుమతులు కైవసం చేసుకున్నారు.

ఓ వైపు విద్యుత్ కాంతులు.. మరోవైపు మెరుపులు



పైడితల్లి చదురుగుడి వద్ద విద్యుత్ వెలుగులు

పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవ పండగ నేపథ్యంలో విజయనగరం జిల్లా కేంద్రం విద్యుత్ కాంతులతో ఓ వైపు మిరమిట్లుగొలుపుతుండగా.. ప్రకృతి కూడా మెరుపుల వర్షం కురిపించింది. దీనికి ఈ చిత్రాలే సాక్ష్యం.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



అమ్మవారి ఆలయ గాలిగోపురం ప్రాంతంలో మెరుపులు

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించండి

గజపతినగరం:గ్రామాల్లో రైతులు, ప్రజలకు జీఎస్టీ తగ్గింపులపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిత, సంబంధాల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్'పై స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. వ్యవసాయ యంత్రపరికరాలతో పాటు ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గడంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, వ్యవసాయశాఖ ఏడీఏ ఏ.నిర్మలాదేవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కర రావు సోమవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను, విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించి వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతూ రోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికర భోజనం అందించాలని చెప్పారు.

మహాధర్నాకు తరలిన విద్యుత్‌శాఖ ఉద్యోగులు



మహాధర్నాకు పయనమైన విద్యుత్‌శాఖ ఉద్యోగులు

జామి: విద్యుత్‌శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ విశాఖలో సోమవారం నిర్వహించిన మహాధర్నాకు జామి నుంచి విద్యుత్‌శాఖ ఉద్యోగులు, కార్మికులు తరలివెళ్లారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.